వైద్య రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం భేష్‌



కేర్‌ ఆన్‌ వీల్స్‌ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ రఘునాథస్వామి

శామీర్‌పేట్‌: పేదలకు నాణ్యమైన వైద్య చికిత్స అందించడంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం అభినందనీయమని మేడ్చల్‌ జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి అన్నారు. డాట్లా ఫౌండేషన్‌, ఇంపాక్ట్‌ గురు ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో కేర్‌ ఆన్‌ వీల్స్‌ ఉచిత వైద్యసేవలను శనివారం హైదరాబాద్‌ జీనోమ్‌వ్యాలీ లోని బయోలాజికల్‌ ఫార్మా (బీఈ) కంపెనీలో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేదలకు నాణ్యమైన వైద్య సేవలతో పాటు ఉచితంగా మందుల పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చిన సంస్థలను అభినందించారు. శామీర్‌పేట, గగన్‌పడ్‌, పటాన్‌చెరు ప్రాంతాల్లో కేర్‌ ఆన్‌ వీల్స్‌ సేవలు అందుబాటులో ఉంటాయని, రక్త, షుగర్‌ పరీక్షలు సైతం చేయనునట్లు నిర్వాహకులు తెలిపారు.

పేదల పెన్నిధి వెంకటస్వామి

పలు ప్రాంతాల్లో ఘనంగా నివాళులర్పించిన నాయకులు


దమ్మాయిగూడలో కాకాకు నివాళులర్పిస్తున్న దృశ్యం


నాగారంలో..

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాల్‌ కార్యాలయాల్లో శనివారం స్వర్గీయ గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి మున్సిపల్‌ చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, వసుపతి ప్రణీతా శ్రీకాంత్‌గౌడ్‌, వైస్‌ చైర్మన్లు మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బండారి మల్లేష్‌యాదవ్‌, పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కమిషనర్‌ నాగమణి, మేనేజర్లు, వెంకటేష్‌, చంద్రశేఖర్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ రఘు తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌ పరిధిలో...



ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో గడ్డం వెంకటస్వామి జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కమిషనర్‌ సాబేర్‌ అలీ, కౌన్సిలర్లు సంగీత, నాగజ్యోతి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు సేఫ్టీ కిట్ల పంపిణీ

మేడ్చల్‌: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికులకు అందజేస్తున్న సెఫ్టీ కిట్లను మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డి బోయిన్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో కార్మికులకు అందజేశారు. బీసీ సంక్షేమ శాఖ నుంచి జిల్లాలో 14 మంది గీత కార్మికులకు కిట్లు మంజూరయ్యాయి. 13 మందికి ఎమ్మెల్యే మల్లారెడ్డి పంపిణీ చేశారు. కల్లుగీత కార్మికులు తమ వృత్తిలో ప్రమాదాలకు గురికాకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, రక్షణ కవచాలు తప్పకుండా ధరించాలని ఆయన సూచించారు. బీసీ వెల్ఫేర్‌ శాఖ డీబీసీడీఓ కేశురాం, ఏబీసీడీఓ రాజేశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య 'ప్రశస్తి'

విద్యార్థుల లోపాలను గుర్తించేందుకు విద్యాశాఖ ప్రత్యేక యాప్‌



సాక్షి, సిటీబ్యూరో: ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉంటేనే శ్రద్ధగా చదువుకోగలుగుతారు. అప్పుడే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటోంది. ప్రస్తుతం విద్యార్థుల్లోని మానసిక, శారీరక లోపాలతోపాటు అభ్యాసన లోపాలు గుర్తించి వైద్యం అందిస్తే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుంది. ఇందులో భాగంగా లోపాలు గుర్తించి బాధిత విద్యార్థులకు సరైన వైద్యం అందించాలనే లక్ష్యంతో «ప్రశస్త్‌» అనే ప్రత్యేక యాప్‌ను విద్యాశాఖ రూపొందించింది. అయితే ఉపాధ్యాయులు తమ దగ్గర చదువుకుంటున్న పిల్లలను నేరుగా పరీక్షించి వారిలోని లోపాలను.. ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనున్నారు. వీటి ఆధారంగా విద్యాధికారులు బాధిత విద్యార్థులకు సరైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటారు.

నమోదు ఇలా...

నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని అన్ని (ప్రభుత్వ, ప్రైవేట్‌) పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ సెల్‌ ఫోన్‌ ద్వారా ప్రత్యేక యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకోవాల్సి ఉంటోంది. ఉపాధ్యాయులు తమ పేరు, పని చేస్తున్న పాఠశాల, మొబైల్‌ నంబర్‌, ఐడీ తదితర వివరాలతో రిజిస్ట్రేషన్‌ చేసుకుంటారు. ఆ తర్వాత విద్యార్థుల పేర్లు, ఒక్కో విద్యార్థిని పరీక్షించి ఆ వివరాలను నమోదు చేస్తారు.

లోపాలను గుర్తించేందుకు...

ఉపాధ్యాయులు తమ సెల్‌ ఫోన్‌లో విద్యార్థులకు సంబంధించి 64 ప్రశ్నలుంటాయి. వీటికి సమాధానాలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటోంది. ఈ జవాబుల ఆధారంగా విద్యార్థుల లోపాలను గుర్తించేందుకు అవకాశముంటోంది.

పార్ట్‌ -1లో...

శిక్షణ పూర్తయిన తర్వాత నుంచి అంటే గత నెల 25 నుంచి పార్ట్‌–1లో భాగంగా విద్యార్థుల లోపాలను గుర్తించే కార్యక్రమం కొనసాగుతోంది. ప్రస్తుతం దసరా సెలవులు రావటంతో కొద్ది రోజులు బ్రేక్‌ ఇచ్చిన ఉపాధ్యాయులు సెలవులు అనంతరం మళ్లీ ప్రారంభించి ఈ నెల 26 వరకు కొనసాగిస్తారు. ఈ యాప్‌లో ఉండే విద్యార్థికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. బోధన సమయంలో విద్యార్థులను ఉపాధ్యాయులు పరిశీలించాల్సి ఉంటోంది. శారీరక, మానసిక సమస్యలతోపాటు బాగా చదువుతున్నారా... అక్షరాలు గుర్తు పడుతున్నారా... నత్తిగా మాట్లాడటం, చిన్న చిన్న విషయాల్లో సైతం వెనుకబడి ఉంటున్నారా.. వంటి తదితర అంశాలను గమనించి నమోదు చేయాల్సి ఉంటోంది.

పార్ట్‌-2లో...

అక్టోబర్‌ 27 నుంచి నవంబర్‌ 14 వరకు పార్ట్‌–2లో భాగంగా విద్యార్థుల లోపాలను గుర్తించే కార్యక్రమాన్ని కొనసాగిస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగి ఉన్న పిల్లలకు బోధించే ఉపాధ్యాయులు లోపం ఉన్న వారిని గుర్తించి పరిశీలిస్తారు. ఈ విషయాలను సంబంధిత వైద్యులకు నివేదిస్తారు. దీని ఆధారంగా వైద్యులు వారికి అవసరమైన వైద్య చికిత్సలు అందిస్తారు.

జిల్లా	ప్రభుత్వ, ప్రైవేట్‌ బడులు	విద్యార్థుల సంఖ్య
మేడ్చల్‌	1798	5.35 లక్షలు
రంగారెడ్డి	2801	6.57 లక్షలు

- 'ప్రశస్తి' యాప్‌లో నమోదైన బాధిత విద్యార్థులకు వైద్యం అందించేలా చర్యలు
- రెండు పార్ట్‌లుగా విద్యార్థుల లోపాలను యాప్‌లో నమోదుపై టీచర్లకు శిక్షణ
- ఈ నెల 27 వరకు విద్యార్థుల్లో శారీరక, మానసిక సమస్యల గుర్తింపు
- 27 నుంచి వచ్చే నెల 14 వరకు ప్రత్యేక అవసరాలున్న వారిలో లోపాల నమోదు

పూర్తయిన శిక్షణ...

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి మండలానికి ఒక రిసోర్స్‌ పర్సన్‌ను ఎంపిక చేశారు. వీరికి జిల్లాల కేంద్రాల్లో ఇప్పటికే శిక్షణ అందజేశారు. వీరు మండల, కాంప్లెక్స్‌ కేంద్రాల్లో ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి వివరాలు నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు.

పటిష్టంగా అమలు



ప్రశస్త్‌ యాప్‌ను పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఉపాధ్యాయులందరూ తమ విద్యార్థులు వివరాలు నమోదు చేసేలా అవగాహన కల్పిస్తున్నాం.

– ఐ.విజయకుమారి, డీఈవో, మేడ్చల్‌ జిల్లా


లలితా త్రిపుర సుందరిగా గడి మైసమ్మ అమ్మవారు

లలితాత్రిపుర సుందరిగా గడి మైసమ్మ

మేడ్చల్‌: దేవీ నవరాత్రి ఉత్సవాలలో మూడవ రోజైన శనివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ఆలయాల్లో మూడవ రోజు నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గడి మైసమ్మ ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. రాఘవేంద్రనగర్‌ కాలనీ, ఆర్టీసీ కాలనీ కట్ట మైసమ్మ ఆలయం, అత్వెల్లి చాముండేశ్వరి ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

రాజరాజేశ్వరీదేవిగా...

పోచారం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అన్నోజిగూడలోని సాయి నగర్‌ కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో చైర్మన్‌ కొండల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వరికుప్పల ప్రమీల రవీందర్‌ దంపతుల సౌజన్యంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయి రెడ్డి, మహేష్‌, ఉత్సవ కమిటీ సభ్యులు చింతం గిరివర్మ, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌, కోన మల్లేష్‌, సోమ నరసయ్య, రామచంద్రారెడ్డి, సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.


సాయినగర్‌ కాలనీలో పూజలు చేసిన చైర్మన్‌ కొండల్‌రెడ్డి

నియామకం

ఉప్పల్‌: చిలుకానగర్‌ శాఖ సీపీఎం మహాసభ కార్యదర్శిగా జె.లలితను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఎం పార్టీ కార్యదర్శి జె. వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిలుకానగర్‌ స్థానిక సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుకునేందుకు తమ వంతుగా పోరాడతామని చెప్పారు.

రూ. 3.6 కోట్లతో అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న చైర్‌ పర్సన్‌ పావనీయాదవ్‌

మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీయాదవ్‌

ఘట్‌కేసర్‌: మున్సిపాలిటీలో రూ. 3.6 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్‌ కార్యాలయంలో చైర్‌ పర్సన్‌ అధ్యక్షతన శనివారం కౌన్సిల్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్‌ ఆమోదం తెలిపింది. అనంతరం చైర్‌ పర్సన్‌ మాట్లాడుతూ... ఒక్కో వార్డు అభివృద్ధికి రూ. 20 లక్షలు కేటాయించామన్నారు. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో 2025 వరకు సిబ్బంది వేతనాలు, వీధి దీపాలు, చెత్త సేకరణ వాహనాల నిర్వహణ, సీసీ చార్జీల చెల్లింపు, పారిశుద్ధ్య నిర్వహణ సామగ్రి, సిబ్బందికి దుస్తులు, చెప్పులు, నూనె, ఇంటి పనుల వసూళ్లు, పబ్లిక్‌ టాయిలెట్స్‌ నిర్వహణను ప్రైవేటు ఏజన్సీలకు అప్పగించేందుకు కౌన్సిల్‌ ఆమోదం తెలిపిందన్నారు. సమావేశంలో కమిషనర్‌ సాబేర్‌ అలీ, వైస్‌ చైర్మన్‌ మాధవరెడ్డి, కౌన్సిలర్లు రమాదేవి, సంగీత, ఆంజనేయులుగౌడ్‌, అనురాధ, నస్త్రీన్‌సుల్తానా, నాగజ్యోతి, హేమలత, పద్మారావు, జహంగీర్‌, వసంత, నరేశ్‌యాదవ్‌, నర్సింగ్‌రావు, రవీందర్‌, కోఆప్షన్‌ సభ్యులు అరుణ, షౌకత్‌, మేనేజర్‌ వెంకటోరెడ్డి, ఏఈ రాజశేఖర్‌, శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీను పాల్గొన్నారు.

మల్కాజిగిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- సమస్యల పరిష్కారంలో ముందుంటాం ఎంపీ ఈటల రాజేందర్‌
- గుండ్లపోచంపల్లిలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి: ఎమ్మెల్యే మల్లారెడ్డి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

మేడ్చల్‌రూరల్‌: మల్కాజిగిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో రూ. 7.70 కోట్ల వ్యయంతో పలు వార్డులలో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... మల్కాజిగిరి పెద్ద పార్లమెంట్‌ నియోజకవర్గం కావడంతో ఇక్కడి సమస్యలు ఎంత తీర్చినా తరగని విధంగా ఉంటాయన్నారు. డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు, ఇతర సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. అయినా ఇంకా సమస్యలు తీర్చాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని చెబుతున్నారని, కేంద్ర ప్రభుత్వం, సీఎస్‌ఆర్‌ పరంగా ప్రజల మౌలిక వసతుల కల్పనలో ప్రజాప్రతినిధులమంతా కలిసికట్టుగా పనిచేసి మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ... గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మేడ్చల్‌ నియోజకవర్గంలోని మున్సిపల్‌ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నిలిపానన్నారు. కేంద్ర నిధులతో మేడ్చల్‌ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీ ఈటలను ఆయన కోరారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌ రెడ్డి, కమిషనర్‌ స్వామి, వైస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌, కౌన్సిలర్లు, మల్లికార్జున్‌ ముదిరాజ్‌, జైపాల్‌రెడ్డి, బాలరాజ్‌, హేమంత్‌రెడ్డి, సరస్వతి, పెంటయ్య, సాయిపేట శ్రీనివాస్‌, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్‌ సభ్యులు, బీజేపీ, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబురం

- రకరకాల పూలతో నేత్రపర్వంగా బతుకమ్మల తయారు
- ఆటపాటలతో సందడి చేసిన మహిళలు


కలెక్టర్‌ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన బతుకమ్మ పండుగ కార్యక్రమాన్ని శనివారం మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని ఆటాపాటలతో సందడి చేశారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖ కార్యాలయాల నుంచి మహిళా ఉద్యోగులు బతుకమ్మలతో మైదానంలోకి తరలివచ్చారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంతోసహా మరికొన్ని ఆఫీసుల్లో మహిళా ఉద్యోగులు పూల మాలలతో చూడ ముచ్చటగా అలంకరించారు. బతుకమ్మ ఆటాపాట కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, లా ఆఫీసర్‌ చంద్రావతి, నాగాంజలి, స్వర్ణలత, మహిళా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. బతుకమ్మ ఆటపాటల్లో డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ రఘునాథ్‌స్వామి, డాక్టర్లు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో డీఆర్‌ఓతోకలసి మహిళా అధికారులు, సిబ్బందితో కలసి మహిళలు ఆట పాటలతోబతుకమ్మ పాటలు పాడటం చూపరులను బాగా ఆకట్టుకుంది.

మేడ్చల్‌లో...

మేడ్చల్‌: మేడ్చల్‌ మున్సిపల్‌ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ దీపికనర్సింహారెడ్డి, మహిళా కౌన్సిలర్లు, మహిళా ఉద్యోగులు, మెప్మా సిబ్బంది కలిసి రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చి కార్యాలయ ఆవరణలో ఉంచి పూజలు చేశారు. బతుకమ్మ ఆట ఆడుతూ పాటలు పాడుతూ సరదాగా గడిపారు. బతుకమ్మ ఘాట్‌ల వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పలు కళాశాలల్లో...

మేడ్చల్‌రూరల్‌: కండ్లకోయ, మైసమ్మగూడలోని పలు ఇంజినీరింగ్‌ కళాశాలల్లో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కండ్లకోయలోని సీఎంఆర్‌ఐటీ, సీఎంఆర్‌ టెక్నికల్‌, సీఎంఆర్‌సెట్‌, సీఎంఆర్‌ మెడికల్‌ కళాశాలల్లో నిర్వహించిన వేడుకల్లో సీఎంఆర్‌ గ్రూప్స్‌ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, సెక్రటరీ వసంతలత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళాశాలలో దసరాను పురస్కరించుకుని ఆయుధ పూజలు నిర్వహించగా అనంతరం విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని ఆడిపాడారు. సీఎంఆర్‌ఐటీ డైరెక్టర్లు, జంగారెడ్డి, రాజిరెడ్డి, ప్రిన్సిపాల్‌లు మధుసూదన్‌రావు, నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- మైసమ్మగూడలోని సెయింట్‌ పీటర్స్‌ ప్రకృతి 2కే 24 పేరుతో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కళాశాల సెక్రటరీ టి.వి.రెడ్డి, డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, ప్రిన్సిపాల్‌ శ్రీలత ప్రత్యేక పూజలు చేసి వేడుకలు ప్రారంభించారు. విద్యార్థులు, మహిళా అధ్యాపకులు బతుకమ్మ ఆటపాటలు, దాండియాల ఆటలతో సంబరాలు జరుపుకొన్నారు.

పోచారం: మహిళల సామూహిక స్ఫూర్తితో పాటు ప్రకృతి అందానికి ప్రతీకగా బతుకమ్మ పండుగ ప్రసిద్ధి చెందినదని నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాల డైరెక్టర్‌ డాక్టర్‌ సి.వి.కృష్ణారెడ్డి అన్నారు. శనివారం చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పువ్వును పువ్వుతో పూజించే సంస్కృతి తెలంగాణలో తప్ప ప్రపంచంలో మరెక్కడా లేదన్నారు. అందుకే బతుకమ్మ పర్వదినం విశ్వవ్యాప్తి చెందిందన్నారు. రకరకాల పూల సౌరభాలతో, ఆట పాటలతో బతుకమ్మ వేడుకలను ఆద్యంతం ఉత్సాహభరితంగా జరుపుకోవడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సుమారు 2 వేల మంది విద్యార్థినులు పాల్గొన్నారు.


బతుకమ్మలతో డీఆర్‌ఓ, లా ఆఫీసర్‌ తదితరులు


మేడ్చల్‌ మున్సిపల్‌ కార్యాలయ ఆవరణలో...


సీఎంఆర్‌ టెక్నికల్‌ కళాశాలలో...



అందంగా అలంకరించిన బతుకమ్మలతో మహిళలు


సెయింట్‌ పీటర్స్‌ కళాశాలలో...


సీఎంఆర్‌ సెట్‌ కళాశాలలో...

బైక్‌ ఢీకొని వ్యక్తి దుర్మరణం

మేడ్చల్‌రూరల్‌: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వారిని బైక్‌ ఢీ కొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మేడ్చల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఓఆర్‌ఆర్‌ సర్వీస్‌ రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... మండలంలోని అలహాబాద్‌కు చెందిన జగదీష్‌(35) డ్రైవర్‌ కావడంతో లారీని క్లీనర్‌తో కలిసి మేడ్చల్‌ పరిధిలోని మునీరాబాద్‌ గ్రామ పరిధిలో ఉన్న ట్రాన్స్‌పోర్ట్‌ కార్యాలయానికి తీసుకొచ్చాడు. శనివారం ఉదయం డ్రైవర్‌ జగదీష్‌, క్లీనర్‌తో కలిసి ఓఆర్‌ఆర్‌ సర్వీస్‌ రోడ్డులో మునీరాబాద్‌ నుంచి కండ్లకోయ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన బైక్‌ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో జగదీష్‌ అక్కడికక్కడే మరణించాడు. క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

నడి రోడ్డుపై ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్‌

మేడ్చల్‌: మేడ్చల్‌ పట్టణంలోని జాతీయ రహదారిపై టీజీ ఆర్టీసీ బస్సు సాంకేతిక కారణాలతో మొరాయించిన ఘటనలో స్థానికంగా ట్రాఫిక్‌ తీవ్రస్థాయిలో స్తంభించిపోయింది. వివరాలివీ... మేడ్చల్‌ పట్టణం మీదుగా వెళ్లే 44వ జాతీయ రహదారి విస్తరణ, ఫ్లైఓవర్‌ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిపై నిత్యం ట్రాఫిక్‌ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఐటీఐ నుంచి చెక్‌ పోస్ట్‌ వరకు పనులు సాగుతుండటంతో నిత్యం గంటల తరబడి వాహనాల ట్రాఫిక్‌ జాం ఉంటుంది. ఈ నేపథ్యంలో శనివారం జాతీయ రహదారిపై నిజామాబాద్‌ వైపు వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్‌ బస్సు పట్టణంలో మొరాయించింది. నడి రోడ్డులో నిలిచి పోవడంతో కిలో మీటర్ల మేర వాహనాలు ఆగిపోయాయి. దీంతో గంటల తరబడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌ పోలీసులు బస్సును పక్కకు తీయించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.


మేడ్చల్‌లో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు